క్లుప్తంగా

నైట్‌షెల్టర్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే నైట్ షెల్టర్లను నిర్వహించడానికి ఆసక్తి కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద, వీఎంసీ వెహికల్ డిపో వద్ద ఉన్న షెల్టర్‌ను నిర్వహించేందుకు ఎన్జీవోలు, నిరాశ్రయుల సమిష్టి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సమాఖ్యలు, ఉమెన్ అండ్ యూత్ కమ్యూనిటీ బేస్డ్ గ్రూప్‌లు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పబ్లిక్/ప్రైవేటు సెక్టార్ కంపెనీలు, అసోసియేషన్‌లు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పట్టణ సామాజికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి(యూసీడీ పీవో)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి అపూర్వ బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో

పటమట(విజయవాడతూర్పు): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 20, 21 తేదీల్లో లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో అపూర్వ- బిల్డింగ్ మెటీరియల్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఐఐఏ ఏపీ శాఖ చైర్మన్ విజయభాస్కర్ తెలిపారు. లబ్బీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో, ఇంటీరియల్స్ ఇన్నోవేటివ్ ఉత్పత్తుల విస్తృత శ్రేణిలో ప్రదర్శించబడే ఈ ఎక్స్‌పోను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనలో వివిధ సెమినార్ల నిర్వహణ, ఆర్కిటెక్ విద్యార్థుల థీసిస్ అవార్డులు, విద్యార్థులు రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శన, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్కిటెక్ట్స్, ఇంజినీర్ల ప్రసంగాలు ఉంటాయన్నారు. రెండు రోజులపాటు జరిగే ప్రదర్శన నగరవాసులకు ఉచితమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌పో పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో సంయుక్త కార్యదర్శులు ప్రొఫెసర్ కె.సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాస్, అసోసియేషన్ ట్రెజరర్ కె. విజయ ఆనందకుమార్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాను పునరుద్ధరించండి

బార్ కౌన్సిల్ చైర్మన్‌కు బీబీఏ ప్రతినిధుల వినతి



విజయవాడస్పోర్ట్స్: న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పునరుద్ధరించాలని, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) విషయంపై న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. హై కోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, కార్యదర్శి పద్మావతిని బీబీఏ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. గతంలో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని పునరుద్ధరించి న్యాయవాదుల కుటుంబాలకు అండగా ఉండాలని, సీవోపీపై న్యాయవాదుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, ఎ.శివరామప్రసాద్(రాజా), కోశాధికారి ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, కె.కాంత్రి కుమార్ ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ప్రదర్శన



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): లబ్బీపేటలో ఉన్న ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన నగర వాసులను ఆకట్టుకుంటుంది. ఈ నెల 22 తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన తెరచి ఉంటుందన్నారు. బెనారస్, చందేరి, చేనేత, పట్టు, కాటన్, చుడిదార్లు, టాప్స్, డ్రెస్ మెటీరియల్స్, కలంకారి, పోచంపల్లి, ఖాదీ, వెంకటగిరి, బెంగాలీ కాటన్, మంగళగిరి కాటన్ పట్టు చీరలు, నారాయణ్ పేట, ఉప్పాడ ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతా వర్క్ కాటన్, భగల్పూరీ సిల్క్, చాందిని సిల్క్, గుజరాత్ డిజైనర్, డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్స్, వరంగల్ టవల్స్ ఇలా వివిధ డిజైన్లు, రంగుల్లో డిస్కౌంట్ ధరలతో నగర వాసులకు అందుబాటులో ఉంచామన్నారు. చేనేత కార్మికులు వివిధ స్వయం ఉపాధి కార్మికులు తయారు చేసిన వస్తువులు, అలంకరణ సామగ్రిని కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాల్సిందిగా ఆయన కోరారు.

నానుతున్న కొండప్రాంతాలు

- జారుతున్న కొండచరియలు
- నగరంలో 20 డివిజన్లలో కొండ ప్రాంతాలు
- పాతబస్తీలో జారిన కొండ చరియలు
- ఆందోళనలో స్థానికులు
- జగన్ పాలనలో కొండప్రాంతవాసులకు ఇళ్లు



కొత్తపేట కొండ ప్రాంతంలో కొండ చరియ పడిన ప్రాంతం



తలుపు విరగ్గొంటుకుంటూ ఇంట్లోకి వచ్చిన కొండ రాయి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న వానలకు కొండప్రాంతాలు నానుతున్నాయి. నగరంలోని మూడు నియోజకవర్గాల్లోనూ ఉన్న కొండ ప్రాంతాల్లో వర్షానికి కొండచరియలు నాని ఎప్పుడు జారిపడిపోతాయో అనే ఆందోళనలో స్థానికులు జీవిస్తున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో వివిధ ప్రాంతాల్లోని కొండలపై జీవిస్తున్న ప్రజానీకం భయంగుప్పెట్లో అల్లాడుతోంది. కొంతమేర ఈ సమస్యలను పరిష్కరిస్తున్నా అధికారుల అలసత్వంతో కొండ ప్రాంతాలను ఆక్రమించి ఇళ్లను ఏర్పరచుకునే వారి సంఖ్య అధికమవుతుంది. దాంతో ఈ సమస్యలు పునరావృతం అవుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

20 డివిజన్లలో కొండ ప్రాంతాలు

నగరంలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నగరపాలకసంస్థ పరిధిలో సుమారు 20 డివిజన్లలో కొండ ప్రాంతాలు మనకు కనిపిస్తాయి. ఆయా కొండ ప్రాంతాల్లో ప్రజలు ఆవాసాలను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అందులో పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 12 డివిజన్లలో కొండ ప్రాంతాలు ఉన్నాయి. తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో మరో ఎనిమిదికి పైగా డివిజన్లలో కొండ ప్రాంతాలు ఉన్నాయి. మొత్తం మీద సుమారు రెండు నుంచి రెండున్నర లక్షల వరకూ ప్రజలు ఆయా కొండ ప్రాంతాల్లో జీవిస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

నగరంలోని కొండ ప్రాంతవాసులు వర్షం పడిన ప్రతిసారి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కొండ ప్రాంతాల్లో సుమారు 20 శాతం ప్రజలు కొండకు శివారు ప్రాంత భాగంలో నివసిస్తున్నారు. అలాంటి ఇళ్లు ఎప్పుడూ ప్రమాదాలకు గురవుతుంటాయి. గడిచిన కాలంలో చాలా వరకూ రిటైనింగ్‌వాల్స్ నిర్మించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం జరిగింది. అయితే వర్షం నీరు కొండ ప్రాంతంలోని భూమిలోకి ఇంకిన తర్వాత అది ఎక్కడ జారుతుందో తెలియని పరిస్థితి. వర్షం ఎడతెరపి లేకుండా కురిసిన సందర్భాల్లో ప్రమాదపు అంచున ఉన్న కొండచరియలు జారుతుంటాయి. దాంతో దానికి అనుబంధంగా ఉన్న కొండ చరియలపై ఉన్న ఇళ్లు సైతం జారిపోతుంటాయి. అక్కడ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ కారణాలతో ఆయా ప్రాంతాల్లోని నివాసితులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

రెండు రోజులు విరిగిపడుతున్న కొండచరియలు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పశ్చిమ నియోజకవర్గంలో అక్కడక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ప్రధానంగా మూడు రోజుల క్రితం శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఘాట్‌రోడ్డులో కొండపై నుంచి అక్కడక్కడ చిన్నచిన్న రాళ్లు పడటంతో ఆ రోజు రాకపోకలను నిలిపివేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా సైతం రాకపోకలు నిలిపివేస్తున్నారు. 51వ డివిజన్ కొత్తపేట కొండ ప్రాంతంలో రాజగిరి వారి వీధి పైభాగంలో కొండచరియలు విరిగిపడ్డాయి. అలాగే విద్యాధరపురంలోనూ ఇదే తీరులో కొండ చరియలు జారిపడ్డాయి.

జగన్ పాలనలో వారికి ఇళ్లు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సొంతిల్లు లేక కొండ ప్రాంతాల్లో ప్రమాదభరితంగా జీవిస్తున్న నివాసితులకు ఇళ్లను కేటాయించారు. నియోజకవర్గంలోని వేలాది మందికి వెల్లటూరు తదితర ప్రాంతాల్లో సొంతిళ్లను కేటాయించి నిర్మాణాలు చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణాలను వేగవంతం చేయాలని వాటి లబ్ధిదారులు కోరుతున్నారు.

కొత్తపేటలో ..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొండచరియ విరగడంతో స్థానిక 51వ డివిజన్ రాజగిరి వారి వీధి కొండ పైభాగం చిట్ట చివరన ఉన్న ఇంటి బేస్మెంట్ కూలింది. దాంతో ఆ ఇంటి అడుగు భాగం కొంత భాగం కూలిపోయింది. ఘటనపై కార్పొరేటర్ రాజేష్‌కు ప్రజలు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే స్పందించి వీఎంసీ అధికారులతో మాట్లాడారు. ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడి మెట్ల మార్గానికి అడ్డుగా ఉన్న మట్టిని, రాళ్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో వెంటనే మాట్లాడటం నిరాశ్రయులైన వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కొండ రాయి జారిపడి ఇంట్లోకి..

భవానీపురం(విజయవాడపశ్చిమ): అల్పపీడనం కారణంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా 38వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని కొండ ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో ఒక మహిళకు తృటిలో ప్రాణాపాయం తప్పగా కాలుకు గాయమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపై 1-2/4-30/2 డోర్ నంబర్ ఇంట్లో పిళ్లా గోపాల్, తులసి దంపతులు నివసిస్తున్నారు. ఉదయం పాల ప్యాకెట్ కోసం గోపాల్ కిందకు వచ్చారు. ఆ సమయంలో తులసి ఇంట్లో పనులు చేసుకుంటుండగా కొండపై నుంచి పెద్ద కొండ రాయి జారి తలుపును విరగకొట్టుకుంటూ వారి ఇంట్లోకి దూసుకువచ్చి తులసి కాలిపై పడింది. దాంతో ఆమె ఒక్కసారిగా పక్కకు తప్పుకుని పరుగెత్తింది. పాల ప్యాకెట్ తీసుకుని ఇంటికి వచ్చిన గోపాల్‌కు విషయం తెలిసి ఆందోళన చెందాడు. వెంటనే బాధితురాలిని సమీపంలోని హాస్పటల్‌కు తీసుకువెళ్లగా చికిత్స చేయించారు. స్థానికులు 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాకు సమాచారం అందించారు. దాంతో ఆమె తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు పిళ్లా తులసిని పరామర్శించి మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం అందజేశారురు. స్థానిక వీఆర్వో విజయలక్ష్మి, ఆర్ఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగంలో విస్తృత అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్షణ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎన్.సందీప్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యాన రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ త్రివిధ దళాల్లో పని చేసేందుకు వివిధ క్యాడర్లలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒకవైపు ఉపాధితో పాటుగా దేశానికి సేవ చేసే అవకాశాలను పొందవచ్చన్నారు. ఇటీవల అగ్నివీర్‌తల్ (ఆర్మీ), అగ్నివీర్‌జల్ (నేవీ), అగ్నివీర్ వాయు (ఎయిర్‌ఫోర్స్) విభాగాల పేరుతో ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

అడిగోపుల మృతికి ఏపీ రచయితల సంఘం సంతాపం



విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం గౌరవ సలహాదారుడు, కవి, విమర్శకుడు అడిగోపుల వెంకటరత్నం మృతికి ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీ భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అడిగోపుల తిరుపతిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేశారు. 1984లో కవితా వ్యాసంగం ప్రారంభించి 25 కవితా సంపుటులు సూర్యోదయం అంచున కథా సంకలనం వెలువరించారు. ఆయన మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని ప్రకటనలో తెలిపారు.

పూరి నాట్యోత్సవంలో ప్రథమ స్థానం

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన పూరీలో నిర్వహించిన శ్రీ పూరీ జగన్నాథ్ నాట్యోత్సవంలో కూచిపూడి విభాగంలో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని నీలిమ సత్తా చాటారు. ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నీలిమను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

శాకంబరిగా మహాలక్ష్మి అమ్మవారు



మహాలక్ష్మి అమ్మవారికి శాకంబరీదేవి అలంకరణ



గంగానమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ నగరాల మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రధాన అర్చకులు అమరలింగేశ్వర కృష్ణప్రసాద్ శర్మ, రెంటచింతల కాశీ విశ్వనాథ్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

- భీమనవారి పేటలోని శ్రీ గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో అలంకరించారు. ఆకుకూరలు, కాయగూరలతో కదంబ ప్రసాదాన్ని తయారు చేసి పంపిణీ చేసినట్లు ఆఅర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

సాయిబాబాకు స్వర్ణకిరీట ధారణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీ (పాతది)లోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బాబా కోసం తయారు చేయించిన స్వర్ణ కిరీటానికి పాలకమండలి సభ్యులు, భక్తులు గోక్షీరాభిషేకం చేసి బాబా విగ్రహానికి అలంకరించారు. కార్యక్రమంలో పాలకమండలి ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఐవీ రమేష్, ప్రధాన కార్యదర్శి చావా శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 36వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యాన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ రెహమతున్నీసా ఇంటింటికీ వెళ్లి ఫ్రైడే..డ్రై డే గురించి వివరిస్తూ ప్రతి శుక్రవారం ఇల్లు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. పాడైపోయిన టైర్లు, వాడేసిన కొబ్బరిబొండాలు, తొట్టెలు/డ్రమ్ముల్లో ఉన్న నీటిని పారబోసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. శానిటరీ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేస్తూ బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ శివరామప్రసాద్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

-డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా వీఎంసీ ఆధ్వర్యాన విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు వెంకట రమణ, త్రివేణి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఫ్రైడే డ్రైడే సందర్భంగాపాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపేట 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో, 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో ర్యాలీలను నిర్వహించారు.





భగవతీ శాకంబరీ..

ముగురమ్మల మూలపుటమ్మ.. ప్రకృతిమాత శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రిపై శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తజనం కూరగాయలను అందజేశారు. భక్తబృందాలు అమ్మవారికి సారె సమర్పించాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











బ్లడ్‌గ్రూప్ అందరికీ తెలియాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరికీ బ్లడ్‌గ్రూప్ తెలిసి ఉండాలని గైనకాలజిస్ట్ డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. గాంధీజీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బ్లడ్‌గ్రూప్ తెలుసుకొని ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమకు ప్రమాదం సంభవించినా, ఇతరులకు రక్తం అత్యవసరంగా అందించాల్సి ఉన్నా బ్లడ్‌గ్రూప్ తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ నిర్వహించారు.

'కేఎల్‌రావు' స్విమ్మర్‌కు కాంస్యం



ఎస్.స్మృతి హర్షిక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జూనియర్, సబ్ జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ స్విమ్మింగ్‌లో కేఎల్‌రావు స్విమ్మింగ్‌పూల్‌కు చెందిన ఎస్.స్మృతి హర్షిక కాంస్య పతకాన్ని సాధించినట్లు కోచ్ షేక్ రఫీ పేర్కొన్నారు. కర్నూలులో ఈ నెల 13, 14 తేదీల్లో పోటీలు జరిగాయని, వీటిలో పలువురు స్విమ్మింగ్‌పూల్‌కు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు. వారిలో 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ విభాగంలో స్మృతి హర్షిక కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. శుక్రవారం స్విమ్మింగ్‌పూల్ వద్ద హర్షికను తోటి విద్యార్థులు, ఈతకొలను సంఘ సభ్యులు ఐ.రమేష్, బాలమురళీకృష్ణ, కార్పొరేషన్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు అభినందించారు.